

## పరివార దేవుళ్లకు పూజలు

శ్రీశైలంటెంపుల్: ఆలయ ప్రాంగణంలోని నందీశ్వరునికి, బయలు వీరభద్ర స్వామి వారికి మంగళవారం శాస్త్రోక్తంగా ఆలయ అధికారులు, అర్చకులు విశేషపూజలను నిర్వహించారు.



## కోట్ల, కేఈ చేసింది శూన్యం

కోట్ల, కేఈ కుటుంబాలు డోన్ నియోజకవర్గానికి చేసింది శూన్యమని ఆర్థిక శాఖమంత్రి బుగ్గన అన్నారు. మంగళవారం డోన్‌లో 'యువత కోసం బుగ్గన' కార్యక్రమాన్ని నిర్వహించారు. 8లో▸



## అలరించిన నృత్యప్రదర్శన

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల ఆలయ నిత్యకళావేదికపై మంగళవారం తిరుపతికి చెందిన నటరాజ డ్యాన్స్ అండ్ మ్యూజిక్ అకాడమీ వారి సంప్రదాయ నృత్య ప్రదర్శన భక్తులను ఆకట్టుకుంది.

## న్యూస్‌రీల్

### 'పది' పరీక్షలకు 560 మంది విద్యార్థులు గైర్హాజరు



సింధూను ఆస్పత్రికి తరలిస్తున్న దృశ్యం

కర్నూలు కల్చరల్: జిల్లాలో నిర్వహిస్తున్న ఎస్‌ఎస్‌సీ –2024 పబ్లిక్ పరీక్షలకు మంగళవారం 560 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారని డీఈఓ కె.శామ్యూల్ తెలిపారు. మొత్తం 31,637 మంది రెగ్యులర్, ప్రైవేట్ విద్యార్థులు పరీక్షలకు దరఖాస్తు చేసుకోగా 30,807 మంది విద్యార్థులు హాజరు కాగా 560 మంది గైర్హాజరయ్యారన్నారు. జిల్లా పరీక్షల పరిశీలనాధికారి (డీఎల్‌ఓ) నాలుగు కేంద్రాలు, డీఈఓ ఒకటి, ఫ్లయింగ్ స్క్వాడ్ ఏడు, సిట్టింగ్ స్క్వాడ్‌లు 44 సెంటర్లను సందర్శించి పరీక్షల నిర్వహణను పరిశీలించారన్నారు. మాల్ ప్రాక్టీస్ కేసు ఒకటి నమోదైందన్నారు.

**విద్యార్థినికి అస్వస్థత**

పెద్దకడబూరు: ఆదోని మండలం దొడ్డనగేరి ఉన్నత పాఠశాలకు చెందిన సింధూ మండల కేంద్రంలోని ఆదర్శ పాఠశాలలో పదో తరగతి పరీక్షకు హాజరైంది. కాసేపటికే అస్వస్థతకు గురైంది. కేంద్రం పర్యవేక్షకులు కుటుంబసభ్యులకు, 108కు కాల్ చేసి సమాచారం అందించారు. విషయం తెలుసుకున్న ఎస్‌ఐ మహేష్‌కుమార్ అక్కడికి చేరుకుని విద్యార్థినిని అంబులెన్స్‌లో స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. చికిత్స అనంతరం తిరిగి పరీక్షా కేంద్రానికి తీసుకొచ్చి విద్యార్థినితో పరీక్ష రాయించారు.

### మంత్రాలయం గ్రూప్ టెంపుల్స్ ఈఓగా సాయికుమార్



కర్నూలు కల్చరల్: మంత్రాలయం గ్రూప్ టెంపుల్స్ ఈఓగా ఎ.సాయి కుమార్ నియమితులయ్యారు. గార్గేయపురం గ్రూప్ టెంపుల్స్ జూనియర్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తున్న ఈయన గ్రేడ్-3 ఈఓగా పదోన్నతి పొందారు. మంత్రాలయం ఈఓగా నియమిస్తూ దేవదాయ శాఖ కమిషనర్ ఉత్తర్వులు జారీ చేశారు.

### చంద్రబాబును నమ్ముకుంటే ఇంతే..

నెల్లూరు జిల్లాలో ఇటీవల టీడీపీలో చేరిన వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డికి, ఆయన భార్య ప్రశాంతికి టిక్కెట్లు ఇచ్చారు.

- తాడిపత్రి అసెంబ్లీ టిక్కెట్ దక్కించుకున్న జేసీ కుటుంబానికి, అనంతపురం పార్లమెంట్ టిక్కెట్ కూడా ఖాయమైనట్లు తెలుస్తోంది.
- అలాగే కడప ఎమ్మెల్యే అభ్యర్థిగా రెడ్డప్పరెడ్డి గారి మాధవికి ఇచ్చారు. కడప పార్లమెంట్ కూడా మాధవి భర్త శ్రీనివాసరెడ్డికి ఇచ్చే అవకాశం ఉంది.
- ఇలా చాలా చోట్ల రెండు సీట్లు ఇచ్చినప్పుడు తమకు ఇవ్వకపోవడం చూస్తే కోట్ల కుటుంబం రాజకీయంగా అత్యంత బలహీనపడిందనే భావనలో చంద్రబాబు ఉన్నట్లు స్పష్టమవుతోందని రాజకీయ విశ్లేషకులు చర్చించుకుంటున్నారు.

### వైఎస్ జగన్‌తోనే న్యాయం

- రాజకీయ ప్రాధాన్యత ఉన్న కుటుంబాలకు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తగిన గౌరవం ఇచ్చారనే చర్చ జరుగుతోంది.
- చెవిరెడ్డి మోహిత్‌రెడ్డికి చంద్రగిరి, ఆయన తండ్రి భాస్కర్‌రెడ్డికి ఒంగోలు పార్లమెంట్ టిక్కెట్ ఇచ్చారు.
- అలాగే మేకపాటి కుటుంబానికి రెండు సీట్లు ఇచ్చారు.
- పెద్దిరెడ్డి కుటుంబానికి ప్రాధాన్యత ఇచ్చారు.
- ఇలా ప్రాధాన్యత ఉన్న కుటుంబాలకు జగన్‌మోహన్‌రెడ్డి తగిన గౌరవం ఇస్తుంటే, టీడీపీలో మాత్రం ఈ పరిస్థితి లేదనే చర్చ నడుస్తోంది.






# ఒక్కటే సీటని.. బలమే లేదని!

**అక్కరకురాని కోట్ల, భూమా, కేఈ కుటుంబాలు**

- ఆలూరు టిక్కెట్ విషయంలో సుజాతమ్మకు మొండిచేయి!
- అనుచరుల నిరసనలను పట్టించుకోని చంద్రబాబు
- కుటుంబానికి ఒకే టిక్కెట్ పేరిట అన్యాయం
- వేమిరెడ్డి కుటుంబం కంటే కోట్ల కుటుంబం బలహీనమైందా? అనే చర్చ
- టీడీపీలో రగులుతున్న అసంతృప్తి జ్వాల
- ప్రాధాన్యత కుటుంబాలకు రెండేసి సీట్లు ఇచ్చిన వైఎస్ జగన్

సాక్షి ప్రతినిధి కర్నూలు: తెలుగుదేశం పార్టీలో టిక్కెట్ల లొల్లి కొనసాగుతోంది. నిరసన జ్వాలలు రగులుతూనే ఉన్నాయి. తాజాగా ఆలూరు అసెంబ్లీ టిక్కెట్ కోట్ల సుజాతమ్మకు ఇవ్వాలని ఆమె అనుచరులు హైదరాబాద్‌లో నిరసన ప్రదర్శనలు చేపట్టారు. చంద్రబాబు నివాసం, ఎన్టీఆర్ ట్రస్ట్‌భవన్ వద్ద బైఠాయించి కోట్ల సుజాతమ్మకు టిక్కెట్ ఇవ్వాలని నినాదాలు చేశారు. అయితే చంద్రబాబు మాత్రం కుటుంబానికి ఒకే టిక్కెట్ ఇవ్వాలని పార్టీ పాలసీగా తీసుకుందని, దీన్ని అంతా అర్థం చేసుకుని పార్టీ కోసం పనిచేయాలని సూచించినట్లు తెలుస్తోంది. అయితే చంద్రబాబు మాటలకు, చేతలకు ఏ మాత్రం పొంతన లేదనే విషయం కోట్ల కుటుంబంతో పాటు అనుచరులకు కూడా స్పష్టమైంది. జిల్లాలో అత్యంత రాజకీయ ప్రాధాన్యత ఉన్న కుటుంబాల్లో కోట్ల కుటుంబం ఒకటి. విజయభాస్కర్‌రెడ్డి ముఖ్యమంత్రిగా, ప్రకాశ్‌రెడ్డి కేంద్రమంత్రిగా పని చేశారు. ఉమ్మడి రాష్ట్రం ఉన్నంత వరకూ కర్నూలు జిల్లాను కోట్ల కుటుంబం శాసించింది. కాంగ్రెస్‌పార్టీలో వారు చెప్పిన వారికి సీట్లు ఇచ్చే పరిస్థితి ఉండేది. ఈ కుటుంబం కాంగ్రెస్ పార్టీని వీడి 2019లో టీడీపీ తీర్థం పుచ్చుకుంది. ఆ ఎన్నికల్లో కర్నూలు ఎంపీగా సూర్యప్రకాశ్‌రెడ్డి, ఆలూరు ఎమ్మెల్యేగా సుజాతమ్మ ఓడిపోయారు. 2014లో కాంగ్రెస్‌పార్టీ నుంచి పోటీ చేసినప్పుడు కూడా సూర్యప్రకాశ్‌రెడ్డి ఓటమిపాలయ్యారు. ఈ ఓటముల నేపథ్యంలో పార్టీ బలం మినహా కోట్ల కుటుంబానికి వ్యక్తిగతంగా పెద్ద బలం లేదనే భావనకు చంద్రబాబు వచ్చినట్లు తెలుస్తోంది. దీంతోనే పార్లమెంట్ స్థానాన్ని తప్పించి డోన్ అసెంబ్లీకి పరిమితం చేశారు. కుటుంబానికి ఒకే టిక్కెట్ అంటూ సుజాతమ్మను తప్పించారు.

**పార్టీ కార్యక్రమాలకు దూరంగా సుజాతమ్మ**

టీడీపీ ప్రకటించిన రెండు జాబితాల్లో కూడా సుజాతమ్మ పేరు లేదు. ఉమ్మడి జిల్లాలో ఆదోని, ఆలూరు మినహా అన్ని స్థానాలకు అభ్యర్థులు ఖరారయ్యారు. దీంతో తనకు టిక్కెట్ ఇవ్వడం లేదని సుజాతమ్మకు స్పష్టత వచ్చింది. దీంతోనే ఆలూరు నియోజకవర్గంలో పార్టీ కార్యక్రమాలకు కూడా దూరంగా ఉన్నారు. ఇటీవలే టీడీపీ తీర్థం పుచ్చుకున్న గుమ్మనూరు జయరాం కూడా కోట్ల సుజాతమ్మకు టిక్కెట్ వద్దని, వీరభద్రగౌడ్‌కు ఇవ్వాలని చంద్రబాబుకు సూచించినట్లు తెలుస్తోంది. వీరభద్ర గౌడ్‌కు ఇస్తే అతనికి ఫండ్ కూడా ఇస్తానని భరోసా ఇచ్చినట్లు సమాచారం. టీడీపీ శ్రేయస్సు కాకుండా తన రాజకీయ స్వార్థం కోసమే జయరాం ఈ ప్రతిపాదన పెట్టినట్లు తెలుస్తోంది. సుజాతమ్మకు టిక్కెట్ ఇస్తే గెలిచినా, ఓడినా నియోజకవర్గం ఆమె చేతిలోనే ఉంటుందని, వీరభద్రగౌడ్‌కు టిక్కెట్ ఇప్పిస్తే ఎలాగూ ఓడిపోతాడని.. అప్పుడు నియోజకవర్గం తన చేతుల్లో ఉంటుందనేది ఆయన ఆలోచనగా చర్చ జరుగుతోంది. ఆ తర్వాత భవిష్యత్తులో తమ కుటుంబానికే ఆ టిక్కెట్ ఇప్పించుకునే అవకాశం ఉంటుందని జయరాం ఎత్తుగడగా తెలుస్తోంది. మరోవైపు గౌడ్‌కు టిక్కెట్ ఇస్తే తాము సహకరించబోమని వైకుంఠం మల్లిఖార్జున చౌదరి, శివజ్యోతి, ప్రసాద్ అధిష్టానికి చెప్పినట్లు సమాచారం.

**ముఖం చెల్లక..**

కోట్ల కుటుంబమే కాదు.. భూమా, కేఈ కుటుంబాలకు కూడా చంద్రబాబు ప్రాధాన్యత ఇవ్వలేదని తెలుస్తోంది. దీంతోనే భూమా బ్రహ్మానందరెడ్డి, కేఈ ప్రభాకర్ కూడా టిక్కెట్ దక్కకపోవడంతో పార్టీలో మొక్కుబడిగా కొనసాగుతున్నారు. పార్టీ కార్యక్రమాల్లో పాల్గొనడం, అభ్యర్థులతో పాటు తిరగలేకపోతుండటం గమనార్హం.

### వ్యయ పరిశీలనకు ఇద్దరు నోడల్ అధికారులు

కర్నూలు(అగ్రికల్చర్): సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో పార్లమెంట్, అసెంబ్లీ నియోజక వర్గాల అభ్యర్థుల వ్యయ పరిశీలనకు జిల్లా కలెక్టర్ ఇద్దరు నోడల్ అధికారులను నియమించారు. స్టేట్ ఆడిట్ జిల్లా అధికారి రమేష్‌బాబు కర్నూలు పార్లమెంటు స్థానానికి, జిల్లా సహకార శాఖ అధికారి ఎస్.రామాంజనేయులు కర్నూలు పార్లమెంటు నియోజకవర్గంలోని అసెంబ్లీ నియోజకవర్గాలకు నోడల్ అధికారులుగా వ్యవహరించనున్నారు. వీరితో పాటు సహాయ వ్యయ పరిశీలకులు, అకౌంటింగ్ టీమ్‌లు ఉంటాయి. వీరంతా జిల్లా ఎన్నికల అధికారి ఆధ్వర్యంలో పనిచేస్తారు.

- కర్నూలు పార్లమెంటు స్థానానికి అసిస్టెంటు ఆడిట్ ఆఫీసర్ సహదేవరెడ్డి సహాయ వ్యయ పరిశీలకులుగా వ్యవహరిస్తారు.
- అకౌంటింగ్ టీంలో సీనియర్ ఆడిటర్లు సంగీతబాయి, పి.మహేశ్ ఉంటారు.
- కర్నూలు అసెంబ్లీకి అసిస్టెంటు రిజిస్ట్రార్ నాగరమణయ్య, ఆదోనికి అసిస్టెంటు ఆడిట్ ఆఫీసర్ ఎఎస్.మురళీకృష్ణ, పత్తికొండకు వాణిజ్య పన్నుల శాఖకు చెందిన ఎం.అమర్నాథరెడ్డి, కోడుమూరుకు అసిస్టెంటు ఆడిట్ ఆఫీసర్ పి.వెంకటరమణ, ఎమ్మిగనూరుకు రమేష్‌బాబు(కమర్షియల్ టాక్స్), మంత్రాలయానికి కె.గౌస్‌పీర( కమర్షియల్ టాక్స్), ఆలూరుకు కె.మురళీకృష్ణ(కమర్షియల్ టాక్స్), పాణ్యం నియోజక వర్గానికి అసిస్టెంటు ఆడిట్ ఆఫీసర్ మహమ్మద్‌రఫి సహాయ వ్యయపరిశీలకులుగా వ్యవహరిస్తారు.
- పార్లమెంటు నియోజక వర్గానికి పోటీ చేసే అభ్యర్థులు రూ.95 లక్షలు, అసెంబ్లీ నియోజక వర్గాలకు పోటీ చేసే అభ్యర్థులు రూ.40 లక్షలకు మించి ఖర్చు చేయరాదని నోడల్ అధికారులు రమేష్ బాబు, రామాంజనేయులు తెలిపారు.

### మే 15 నాటికి ఏపీ ఈఆర్‌సీ భవనం పూర్తి



ఏపీ ఈఆర్‌సీ భవన నిర్మాణ పనుల మ్యాప్‌ను పరిశీలిస్తున్న చైర్మన్ జస్టిస్ నాగార్జున రెడ్డి

కర్నూలు (అగ్రికల్చర్): నగర శివారులోని కార్బైడ్ ఫ్యాక్టరీ ప్రాంతంలో నిర్మిస్తున్న ఆంధ్రప్రదేశ్ ఎలక్ట్రికల్ రెగ్యులేటరీ కమిషన్ భవన నిర్మాణ పనులను మే 15 నాటికి పూర్తి చేయాలని సంబంధిత ఇంజినీరింగ్ అధికారులను కమిషన్ చైర్మన్ జస్టిస్ నాగార్జున రెడ్డి ఆదేశించారు. మంగళవారం ఆయన ఏపీ ఎస్పీడీసీఎల్ అధికారులతో కలిసి నిర్మాణ పనులను పరిశీలించారు. అనంతరం ఇంజినీరింగ్ అధికారులతో సమీక్ష నిర్వహించారు. భవన నిర్మాణం పూర్తయితే ఏపీ ఈఆర్‌సీ కర్నూలు కేంద్రంగా మే చివరి నుంచి పనిచేస్తుందన్నారు. కార్యక్రమంలో విద్యుత్ శాఖ ఎస్ఈ ఎం.ఉమాపతి, పలువురు ఏపీ ఎస్పీడీసీఎల్ అధికారులు పాల్గొన్నారు.

## ఎన్నికల నిర్వహణకు సహకరించాలి

- ఓటు హక్కును స్వేచ్ఛగా వినియోగించుకోండి
- కలెక్టర్ డాక్టర్ జి.సృజన

కృష్ణగిరి: ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు నిర్వహించేందుకు ప్రజలందరూ సహకరించాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.సృజన కోరారు. మంగళవారం ఆమె జిల్లా ఎస్పీ కృష్ణకాంత్‌తో కలిసి కృష్ణగిరి మండల పరిధిలోని ఆలంకొండ, కటారుకొండ గ్రామాల పోలింగ్ కేంద్రాలను పరిశీలించి గ్రామ సభలు నిర్వహించి ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎన్నికల్లో ఇష్టమైన వారికి స్వేచ్ఛగా ఓటు వేసుకోవచ్చన్నారు. ఓటర్లను బెదిరించినా, ప్రలోభాలకు గురిచేసినా కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. ఎస్పీ కృష్ణకాంత్ మాట్లాడుతూ కట్టుదిట్టమైన భద్రత ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. సమస్యాత్మక గ్రామాల్లో సీఆర్‌పీఎఫ్ బలగాలతో రక్షణ కల్పిస్తామన్నారు. ఆలంకొండ గ్రామస్తులు నడవలేని వారికి, ఇతరత్రా ఆరోగ్య సమస్యలు ఉన్నవారికి ఓటింగ్ రోజు ప్రత్యేక ఏర్పాట్లు చేయాలని కలెక్టర్‌ను కోరగా ఆమె వెంటనే స్పందిస్తూ నడవలేని స్థితిలో ఉన్న వారికి వీల్‌చైర్ అవకాశం కల్పిస్తామన్నారు. ఆరోగ్య సమస్యలు ఉన్నవారికి ఓటింగ్‌లో క్యూ లైన్‌లో ఉంచకుండా త్వరగా ఓటు వేసేలా చర్యలు తీసుకుంటామన్నారు. వీరి వెంట ఆర్డీఓ రామలక్ష్మి, డీఎస్పీ శ్రీనివాసరెడ్డి, తహసీల్దార్ అనురాధ, ఎంపీడీఓ రాబర్ట్ విల్సన్, ఎంఈఓ సునంద ఉన్నారు.



కటారుకొండలో గ్రామస్తులతో మాట్లాడుతున్న కలెక్టర్ డాక్టర్ జి. సృజన

### సమస్యాత్మక ప్రాంతాల్లో పోలీసు కవాతు



కవాతు నిర్వహిస్తున్న సీఆర్‌పీఎఫ్ బలగాలు

కర్నూలు: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో సమస్యాత్మక ప్రాంతాల్లో సీఆర్‌పీఎఫ్ బలగాలతో కలసి స్థానిక పోలీసులు కవాతు నిర్వహించారు. జిల్లాలోని కర్నూలు, పత్తికొండ, ఎమ్మిగనూరు పోలీస్ సబ్ డివిజన్ల పరిధిలో కవాతు నిర్వహించి ఓటు హక్కు వినియోగంపై అవగాహన కల్పించారు. కర్నూలు రెండవ పట్టణ సీఐ ఇంతియాజ్ బాషా ఆధ్వర్యంలో సర్కిల్ పరిధిలోని జిల్లా పోలీసు కార్యాలయం, అంబేడ్కర్ విగ్రహం, పాతబస్తీ, హెడ్‌పోస్టాఫీసు, ఓల్డ్ కంట్రోల్ రూమ్, కిడ్స్ వరల్డ్, రాజ్‌విహార్, బంగారుపేట, ఆర్‌ఎస్ రోడ్, ఎస్‌బీఐ సర్కిల్ ఇన్‌కమ్ ట్యాక్ ఆఫీస్ మీదుగా తిరిగి రెండవ పట్టణ పోలీస్ స్టేషన్ వరకు సాయుధ బలగాలతో కలసి కవాతు నిర్వహించారు. మూడవ పట్టణ సీఐ మురళీధర్ రెడ్డి, ఎస్‌ఐలు వెంకటసురేష్, సిద్దయ్య ఆధ్వర్యంలో సర్కిల్ పరిధిలోని సి.క్యాంప్, కర్నూలు మెడికల్ కాలేజ్, బుధవారపేట ప్రాంతాల్లో కవాతు నిర్వహించారు. పత్తికొండ యూపీఎస్ సీఐ శ్రీనివాస్ ఆధ్వర్యంలో సర్కిల్ పరిధిలోని పులికొండ గ్రామంలో, ఎమ్మిగనూరు యూపీఎస్ సీఐ మధుసూదన్‌రావు ఆధ్వర్యంలో సర్కిల్ పరిధిలోని వెంకటాపురం, మిలిటరీ కాలనీ, అన్నమయ్య సర్కిల్ ప్రాంతాల్లో సాయుధ బలగాలతో కలసి స్థానిక పోలీసులు కవాతు నిర్వహించి ప్రజల భద్రతకు భరోసా కల్పించారు.

|  | ఇఫ్తార్ | సహెర్ |
|---|---|---|
| కర్నూలు | సా॥ 6:32 | ఉ॥ 4:58 |
| ఆదోని | సా॥ 6:35 | ఉ॥ 5:01 |
| నంద్యాల | సా॥ 6:32 | ఉ॥ 4:55 |
| ఆత్మకూరు | సా॥ 6:30 | ఉ॥ 4:56 |
| బనగానపల్లె | సా॥ 6:33 | ఉ॥ 4:56 |

## రంజాన్ వేళలు

**హదీస్ వెలుగు :**

మొర పెట్టుకునేవారు ఉన్నారా? వేడుకునే వారు ఉన్నారా? వారి మొర విని తీరుస్తాను అని అల్లాహ్ రంజాన్‌లో ప్రతిరోజూ మూడుసార్లు అడుగుతాడు. తరచూ అల్లాహ్‌ను వేడుకుంటూ ఉండండి. – పవిత్ర ఖురాన్

## క్లుప్తంగా

### వడదెబ్బతో మహిళ మృతి

**కోవెలకుంట్ల:** అమడాల గ్రామానికి చెందిన బోయ బాల వెంగమ్మ(52) వడదెబ్బతో మంగళవారం మృతి చెందింది. కుటుంబ సభ్యులు అందించిన సమాచారం మేరకు.. గత కొన్ని రోజులుగా వెంగమ్మ అనారోగ్యంగా ఉండటం తోపాటు అధిక ఎండలతో వడదెబ్బకు గురై మృత్యువాత పడింది. విషయం తెలుసుకున్న బనగానపల్లె ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి తనయుడు కాటసాని ఓబుళరెడ్డి గ్రామాన్ని చేరుకుని మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఆయన వెంట గ్రామ వైఎస్సార్‌సీపీ నాయకులు భాస్కర్‌రెడ్డి, నాగిరెడ్డి, రామసుబ్బారెడ్డి ఉన్నారు.

### యువతి ఆత్మహత్య


హరిత మృతదేహం

**వెల్దుర్తి(కృష్ణగిరి):** మండల పరిధిలోని చెరుకులపాడు గ్రామానికి చెందిన హరిత(16) పురుగు మందు తాగి ఆత్మహత్యకు పాల్పడింది. ఎస్‌ఐ చంద్రశేఖర్ రెడ్డి తెలిపిన వివరాలు.. 10వ తరగతి వరకు చదివిన హరిత కుట్టుమిషన్‌తో తల్లిదండ్రులకు చేదోడుగా ఉంటోంది. సోమవారం తల్లిదండ్రులు శ్రీనివాసులు, కళావతి పొలానికి వెళ్లగా ఇంట్లో పురుగు మందు తాగి అపస్మారక స్థితికి చేరుకుంది. గమనించిన సోదరుడు సుధాకర్ చుట్టుపక్కలవారి సాయంతో హుటాహుటిన 108 వాహనంలో వెల్దుర్తి సీహెచ్‌సీకి తరలించారు. మెరుగైన చికిత్స నిమిత్తం కర్నూలు ఆసుపత్రికి తరలించారు. అక్కడ కోలుకోలేక మంగళవారం తెల్లవారుజామున మృతిచెందింది. కుటుంబ కలహాలతో తన కూతురు మనస్తాపం చెంది ఆత్మహత్యకు పాల్పడిందని తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

### కౌన్సెలింగ్ వాయిదా

**కర్నూలు (హాస్పిటల్):** స్టేట్ క్యాన్సర్ ఇన్‌స్టిట్యూట్‌కు సంబంధించి రేడియో థెరపీ టెక్నీషియన్ పోస్టుల భర్తీకి ఈనెల 20వ తేదీన నిర్వహించాల్సిన కౌన్సెలింగ్ వాయిదా వేసినట్లు కర్నూలు మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ చిట్టి నర్సమ్మ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. మెరిట్ లిస్టులు, సెలెక్షన్ లిస్టులు సరిచేసిన అనంతరం తదుపరి కౌన్సిలింగ్ తేదీ తెలియజేస్తామన్నారు.

# కోట్ల, కేఈ కుటుంబాలు డోన్‌కు చేసింది శూన్యం

- యువత భవిష్యత్‌తో చెలగాటమాడారు
- ఫ్యాక్షన్ రాజకీయాలకు అమాయకులను బలి చేశారు
- సొంతూర్లకు రోడ్లు వేసుకోలేని వారికి అభివృద్ధి గురించి ఎలా తెలుస్తుంది
- ఐదేళ్లలో యువతకు ఉపాధి, ఉద్యోగ శిక్షణ కేంద్రంగా డోన్‌ను మార్చేశాం
- 'యువత కోసం బుగ్గన' సదస్సులో రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి బుగ్గన



సదస్సులో మాట్లాడుతున్న ఆర్థిక శాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి


సమావేశానికి హాజరైన యువతీయువకులు

**డోన్:** 'సుదీర్ఘ రాజకీయ అనుభవం ఉందని చెప్పుకుంటున్న కోట్ల, కేఈ కుటుంబాలు డోన్ నియోజకవర్గానికి చేసింది శూన్యం. కనీసం పది మందికి ఉపాధి కల్పించే కార్యక్రమాలు చేపట్టలేదు. ఫ్యాక్షన్‌ను పెంచి పోషించిన చరిత్ర వారిది. యువత భవిష్యత్తును సర్వనాశనం చేసిందెవరో నియోజకవర్గ ప్రజలకు తెలుసు' అని మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి అన్నారు. డోన్ కొత్త బస్టాండ్ సమీపంలోని ఫంక్షన్ హాల్‌లో మంగళవారం 'యువత కోసం బుగ్గన' సదస్సులో ఆయన పాల్గొన్నారు. ఆయా అంశాలపై యువత అడిగిన ప్రశ్నలకు మంత్రి సవివరంగా సమాధానాలు ఇవ్వడంతో ఫంక్షన్ హాల్‌లో హర్షధ్వానాలు హోరెత్తాయి. ఈ సందర్భంగా మంత్రి బుగ్గన మాట్లాడుతూ.. గత టీడీపీ ప్రభుత్వం యువత పేరుతో ప్రజా సొమ్మును లూటీ చేసిందన్నారు. స్కిల్ డెవలప్‌మెంట్ పేరుతో రూ.271 కోట్లను నారా నిలువు దోపిడీ చేశారని విమర్శించారు. కనీసం మూడు, నాలుగు నెలలు శిక్షణ ఇవ్వాల్సి ఉండగా, రెండు, మూడు రోజుల్లోనే శిక్షణను ముగించి కోట్లాది రూపాయలను దారి మళ్లించారన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చిన తర్వాత డోన్‌ను యువతకు ఉద్యోగ, ఉపాధి శిక్షణ కేంద్రంగా మార్చేశామన్నారు. డోన్‌లో ప్రభుత్వ ఉద్యోగాలకు కోచింగ్ ఇచ్చే సెంటర్‌తో పాటు ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్సీ, ఎమర్జింగ్ టెక్నాలజీ, స్పోర్ట్స్ ఇలా అన్నిరకాల కేంద్రాలను యువత కోసం ఏర్పాటు చేశామన్నారు. ప్యాపిలి పట్టణంలో రూ.50 కోట్లతో ఇంటిగ్రేటెడ్ మార్కెట్, 100 పడకల ప్రభుత్వాసుపత్రి, నాలుగు పాలిటెక్నిక్ కళాశాలలు, నాలుగు సంక్షేమ వసతిగృహాలతో పాటు గొర్రెలపెంపకం దారుల శిక్షణ కేంద్రం, కియా నాలెడ్జ్ సెంటర్, స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్లను ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సహకారంతో ఏర్పాటు చేశామన్నారు. భారీ వాహన డ్రైవర్ల శిక్షణ సంస్థను ఏర్పాటుచేసి యువతకు ఉపాధి కల్పిస్తున్నామన్నారు. ఓర్వకల్లు ఎయిర్‌పోర్టు సమీపంలో బోయింగ్ కంపెనీ ద్వారా పాలిటెక్నిక్, ఐటీఐ, ఫ్లై స్కూల్ ఏర్పాటు చేస్తున్నామన్నారు. అభివృద్ధిని చూసి ఓటు వేయాలని ముఠా కక్షలను ప్రేరేపించే నాయకులను తిరిగి ఇంటికి పంపాలని యువతను మంత్రి కోరారు.

**హత్యా రాజకీయాలను ప్రజలు మరిచిపోలేదు**

50 ఏళ్ల రాజకీయ జీవితంలో అమాయకులైన ఎందరో ప్రాణాలను ముఠా కక్షల కారణంగా బలితీసుకొని రాష్ట్రంతో పాటు కేంద్రంలో అత్యున్నత పదవులు అలంకరించిన మీ అడ్డా ఏదని.. మంత్రి బుగ్గన టిడిపి అభ్యర్థి కోట్ల సూర్యప్రకాష్‌రెడ్డి, మాజీ ఉప ముఖ్యమంత్రి కేఈ కృష్ణమూర్తిలను ప్రశ్నించారు. డోన్ మా అడ్డా అని ప్రజలను తిరిగి మభ్యపెట్టేందుకు ఇరువర్గాల నాయకులు ప్రయత్నిస్తుండటం అవివేకమన్నారు. వారు చేసిన అరాచకాలు, అక్రమాలు, హింస దౌర్జన్యాలు, హత్యా రాజకీయాలను ఈ ప్రాంతం ప్రజలు మరిచిపోలేదన్నారు. డోన్ అడ్డా అయితే టీడీపీ అభ్యర్థి ఫంక్షన్‌హాల్‌లో మకాం ఎందుకు పెడతారని మంత్రి నిలదీశారు. ఎన్నికల వరకు ఫంక్షన్‌హాల్‌లో ఉండి ఎన్నికల తర్వాత కర్నూలు, హైదరాబాద్‌లకు మకాం మార్చే నాయకులను ప్రజలు నమ్మరన్నారు. అర్ధ శతాబ్దం రాజకీయాలు నడిపి తమ సొంత ఊరిలో కూడా సరైన రోడ్లు వేసుకోలేని నాయకులకు అభివృద్ధి గురించి ఎలా తెలుస్తుందని ఎద్దేవా చేశారు. కనీసం సొంత ఇళ్లు కూడా ఇక్కడ నిర్మించుకోలేని వారు స్థానికులు ఎలా అవుతారని ప్రశ్నించారు.

**డోన్‌లో శాంతిని నెలకొల్పాం..**

తనను రాజకీయాలలో బచ్చా అని టీడీపీ అభ్యర్థి కోట్ల సంబోధించడాన్ని మంత్రి బుగ్గన తప్పుపడుతూ.. 'రాజకీయాలలోకి ఎప్పుడు వచ్చామన్నది కాదు అన్నయ్య ముఖ్యం .. బుల్లెట్ దిగిందా లేదా అన్నదే ముఖ్యం' అని అన్నారు. బీటెక్ అయిపోగానే 30 ఏళ్ల క్రితం తాను బేతంచెర్ల సర్పంచ్‌గా రెండుసార్లు ఎన్నికైన విషయాన్ని ఆయన గుర్తు చేశారు. యువత భవిష్యత్తును ఘర్షణలు, వ్యక్తిగత విద్వేషాలు రగల్చడం మూలంగా సర్వనాశనం చేసింది ఎవరో నియోజకవర్గ ప్రజలకు తెలుసునన్నారు. వైఎస్‌ఆర్‌సీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత డోన్ నియోజకవర్గంలో ప్రశాంతమైన వాతావరణం ఏర్పడిందని, మహిళలు స్వేచ్ఛగా తిరగగలుగుతున్నారన్నారు. వైఎస్సార్‌సీపీ కార్యకర్తల ఇళ్ల వద్దకు కొందరు టీడీపీ నాయకులు వచ్చి భయపెట్టే ప్రయత్నం చేయడం అవివేకమన్నారు. వైఎస్‌ఆర్‌సీపీ యువజన విభాగం అధ్యక్షులు ఆర్‌ఈ రాజవర్దన్ అధ్యక్షతన జరిగిన ఈ సదస్సులో మంత్రి తనయుడు బుగ్గన అర్జున్‌రెడ్డి, రాష్ట్ర మీట్ కార్పొరేషన్ చైర్మన్ శ్రీరాములు, ఎంపీపీ రేగటి రాజశేఖర్‌రెడ్డి, జెడ్పీటీసీ బద్దల రాజ్‌కుమార్, మున్సిపల్ చైర్మన్ సప్తశైల రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

### ఏపీఎస్పీ కానిస్టేబుళ్లకు కొత్త యూనిఫాం


నూతన డ్రస్ కోడ్ ఏపీఎస్పీ పోలీసులతో కమాండెంట్ శ్రీనివాసరావు

**కర్నూలు:** ఏపీ స్పెషల్ ప్రొటెక్షన్ ఫోర్స్ (ఏపీఎస్పీ) విభాగంలోని కానిస్టేబుల్, హెడ్ కానిస్టేబుళ్లకు కొత్త యూనిఫాం ప్రవేశపెడుతూ ఈ నెల 4న హోం శాఖ ముఖ్య కార్యదర్శి హరీష్ కుమార్ గుప్తా ఉత్తర్వులు జారీ చేశారు. వాటిని మంగళవారం సాయంత్రం బెటాలియన్ కమాండెంట్ ఎస్.శ్రీనివాసరావు చేతుల మీదుగా సిబ్బందికి పంపిణీ చేశారు. పోలీసు యూనిఫాంలో కొత్తగా చేసిన మార్పులను వివరిస్తూ కమాండెంట్ సిబ్బందికి పీక్యాప్, విజిల్ కార్డు, లెదర్ బెల్టులను స్వయంగా అమర్చారు. కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ పోలీసు అధికారుల సంఘం కర్నూలు రెండవ బెటాలియన్ అధ్యక్షులు వై.పెద్దన్న, కార్యదర్శి హరిశ్చంద్రుడుతో పాటు అడిషనల్ కమాండెంట్ ప్రభుకుమార్, అసిస్టెంట్ కమాండెంట్లు ఎస్.ఎం.బాషా, కేశవరెడ్డి, రవికిరణ్, డీఎస్పీ భక్తవత్సలం పాల్గొన్నారు.

### ఆశాజనకంగా ఎండుమిర్చి ధరలు

**నంద్యాల(సెంట్రల్):** పట్టణంలోని మిర్చి యార్డులో ఎండుమిర్చి ధరలు ఆశాజనకంగా కొనసాగుతున్నాయి. మంగళవారం సూపర్-10, సూపర్-5 రకం సరకు అమ్మకాలు జరిగాయి. సూపర్-10 రకం జనరల్ క్వింటాలు గరిష్ట ధర రూ.15,500, మధ్యస్థ ధర రూ.14,800, కనిష్ట ధర రూ.13,500గా నమోదైంది. ఇదే రకం తాలుకాయ జనరల్ గరిష్ట ధర క్వింటాలు రూ.7,600, మధ్యస్థ ధర రూ.7,000, కనిష్ట ధర రూ.6,300గా పలికింది. సూపర్-5 రకం జనరల్ గరిష్ట ధర క్వింటాలు రూ.15,500, మధ్యస్థ ధర రూ.15,000, కనిష్ట ధర రూ.14,500గా నమోదైనట్లు యార్డు ఎంపిక శ్రేణి కార్యదర్శి కల్పన ఓ ప్రకటనలో తెలిపారు. అన్నదాతలు దళారులను నమ్మి మోసపోకుండా యార్డులోని ద్రు వీకృత వ్యాపారస్తుల వద్ద సరకు అమ్ముకొని మంచి ధరను పొందాలని సూచించారు.

# నిబంధనలు పాటించాలి

- బీఈడీ కళాశాలల యాజమాన్యాలతో ఆర్‌యూ వీసీ సుధీర్ ప్రేమ్‌కుమార్


మాట్లాడుతున్న వీసీ ప్రొఫెసర్ బి.సుధీర్ ప్రేమ్‌కుమార్

**కర్నూలు కల్చరల్:** రాయలసీమ విశ్వవిద్యాలయం అనుబంధ బీఈడీ కళాశాలలు నిబంధనలను అనుసరించి నిర్వహించాలని వర్సిటీ వైస్‌చాన్సలర్ ప్రొఫెసర్ బి.సుధీర్ ప్రేమ్‌కుమార్ ఆదేశించారు. మంగళవారం వర్సిటీ కాన్ఫరెన్స్ హాల్‌లో బీఈడీ కళాశాలల యాజమాన్యాలతో నిర్వహించిన సమావేశంలో వీసీ మాట్లాడారు. అఫ్లియేషన్ కమిటీల సందర్శన సమయానికంతా కళాశాలల్లో ఏవైనా లోటు పాట్లుంటే సరిదిద్దుకోవాలన్నారు. తరగతి గదులు, ల్యాబ్‌లు, గ్రంథాలయం, ఆటస్థలం మొదలైన వసతులన్నీ నిబంధనలకు అనుగుణంగా ఉండాలన్నారు. విద్యార్థుల సర్టిఫికెట్ వెరిఫికేషన్‌కు సంబంధించి ఆంధ్ర, ఆచార్య నాగార్జున, శ్రీవెంకటేశ్వర విశ్వవిద్యాలయాలు అనుసరిస్తున్న విధానాలను అధ్యయనం చేసి అందుకు అనుగుణంగా చర్యలు చేపడతామన్నారు. మోడరేషన్ బోర్డుకు సంబంధించి జవాబు పత్రాల మూల్యాంకనానికి జవాబు పత్రాల కాపీలను దరఖాస్తు చేసుకున్న విద్యార్థులకు అందించేందుకు పాలక మండలిలో చర్చించి నిర్ణయం తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో వర్సిటీ రెక్టార్ ఆచార్య ఎన్.టి.కె.నాయక్, రిజిస్ట్రార్ డాక్టర్ నాగుల అంకన్న, సీడీసీ డీన్ ఆచార్య సి.వి.కృష్ణారెడ్డి, కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ డాక్టర్ ఎస్.వెంకటేశ్వర్లు, బీఈడీ కళాశాలల యాజమాన్యాల అసోసియేషన్ నాయకులు పాల్గొన్నారు.

# అందుబాటులో ఎన్నికల యాప్‌లు

- ఎన్నికల్లో అక్రమాలపై ఫిర్యాదులకు సీ-విజిల్ యాప్
- రాజకీయ పార్టీలు అనుమతులు పొందేందుకు సువిధ యాప్
- సుగం యాప్ ద్వారా వాహనాల నియంత్రణ
- ఓటరు నమోదు నుంచి ఫిర్యాదులు, సలహాల వరకూ యాప్‌ల రూపకల్పన

**కర్నూలు(సెంట్రల్):** కేంద్ర ఎన్నికల సంఘం పలు యాప్‌లను అందుబాటులో ఉంచింది. ఓటరు నమోదు నుంచి అనుమతులు పొందడం, ఎన్నికల్లో అక్రమాలపై ఫిర్యాదు చేయడం తదితర పనులన్నీ యాప్‌లతోనే చేసుకునేలా చర్యలు తీసుకుంది.

**ఐదు నిమిషాల్లో ఫిర్యాదు...**

ఓటరు నమోదుకు స్మార్ట్‌ఫోన్‌లోనే దరఖాస్తును అప్‌లోడ్ చేయవచ్చు. ఓటరు జాబితాలో పేరు ఉందో లేదో చెక్ చేసుకునేందుకూ యాప్‌ను ఉపయోగించుకోవచ్చు. ఎన్నికల ప్రచారంలోనూ, పోలింగ్ రోజున అక్రమాలు చోటుచేసుకున్నా స్మార్ట్‌ఫోన్ ద్వారా కేవలం 5 నిముషాల్లోనే అధికారులకు ఫిర్యాదు చేయవచ్చు. ఎన్నికల ప్రచారానికి అనుమతులు కావాలన్నా ఆన్‌లైన్‌లోనే దరఖాస్తులను పంపవచ్చు. అభ్యర్థుల వాహనాల నియంత్రణకు కూడా సాంకేతికత అందుబాటులోకి వచ్చింది.

**మీడియా, సోషల్ మీడియాపై ఫోకస్...**

కేంద్ర ఎన్నికల సంఘం పెయిడ్ న్యూస్‌ను నివారించేందుకు షోషల్ మీడియా ప్లాట్ ఫామ్స్, ఫేస్‌బుక్, వాట్సాప్, ట్విట్టర్, ఇతర ఖాతాల ద్వారా చేసుకునే ప్రచారంపై దృష్టి సారించారు. ఎలక్ట్రానిక్ మీడియాలో వచ్చే అడ్వర్టైజ్‌మెంట్, స్క్రోలింగ్ వార్తలపై కూడా దృష్టి సారించారు. రేడియో, సినిమా హాళ్లలో ప్రచారం, ఈపేపర్లు, ప్రచార రథాలు, కేబుల్ టీవీల్లో స్క్రోలింగ్‌లను ప్రచారం చేసుకోవాలంటే ముందుగా ఎంసీఎంసీ(మీడియా సర్టిఫికేషన్ ఆఫ్ మానిటరింగ్ కమిటీ) అనుమతి తీసుకోవాలి. అనుమతి తీసుకొని ప్రచారం నిర్వహిస్తే వాటి విలువ అభ్యర్థుల ఖర్చులో రాస్తారు.

- ప్రైవేట్ స్థలాల్లో పోస్టర్లు, హోర్డింగ్‌లు పెట్టుకోవడానికి కూడా ఎంసీఎంసీ అనుమతి తీసుకోవాలి.
- ప్రింట మీడియాలో అభ్యర్థులు అడ్వైజ్‌మెంట్ కోసం ఎన్నికల సంఘం అనుమతి తీసుకోవాల్సిన అవసరం లేదు. కేవలం ఎన్నికల ముందు రోజు, ఎన్నికల రోజుల్లో మాత్రమే అభ్యర్థులు ఎంసీఎంసీ అనుమతి తీసుకొని ప్రకటనలు ఇచ్చుకోవాలి. ఆ రెండు రోజుల్లో తప్పా మిగతా రోజుల్లో యథావిధిగా ప్రకటనలు ఇచ్చుకోవచ్చు. అయితే నిబంధనల ప్రకారమే ఉండాలి. లేకపోతే పెయిడ్ న్యూస్ కింద పరిగణించేందుకు అవకాశం ఉంది.

**సి-విజిల్ యాప్**

ఎన్నికల కమిషన్ తెచ్చిన యాప్‌లో ముఖ్యమైనది సి-విజిల్ యాప్ ఒకటి. గూగుల్ ప్లే స్టోర్ నుంచి పౌరులు/ఓటర్లు సి-విజిల్ యాప్ (ఇంగ్లీష్ వెర్షన్) డౌన్‌లోడ్ చేసుకోవచ్చు.

- సి-విజిల్ యాప్‌లో పౌరులు/ఓటర్లు మొబైల్ నంబర్, చిరునామాతో రిజిస్టర్ చేసుకోవలసి ఉంటుంది.
- సి-విజిల్ యాప్‌లోకి లాగిన్ అయినప్పుడు పౌరులు/ఓటర్ల ఫొటో, వీడియో ఐకాన్లను చూడగలుగుతారు.
- నగదు, మద్యం పంపిణీ, బహుమతులు, పోస్టర్లు, బ్యానర్లు, తుపాకులు, పిస్టళ్లు వంటి ఆయుధాల ప్రదర్శన, బెదిరింపు, పెయిడ్ న్యూస్, ఆస్తులు పాడుచేయడం మొదలైన వాటిని ఎవరైనా తమ కెమెరాతో తీసి అప్‌లోడ్ చేయవచ్చు.

**సువిధ యాప్**

- సువిధ యాప్ రాజకీయ పార్టీలకు సంబంధించినది. ఎన్నికల ప్రచారంలో రాజకీయ పార్టీలు ఎటువంటి అనుమతుల కోసమైనా సువిధ యాప్‌ను వినియోగించుకోవచ్చు.
- సువిధ యాప్ ద్వారా పొందిన అనుమతులు, వాటి ఖర్చులను అభ్యర్థులు ఖరారు అయ్యే వరకు సంబంధిత రాజకీయ పార్టీల ఖాతాలోను, అభ్యర్థులు ఖరారు అయిన తర్వాత అభ్యర్థి ఖాతాలో ఖర్చులు నమోదు చేస్తారు.
- వాహనాలకు, మైక్‌సెట్ల వినియోగానికి, బహిరంగసభలు, సమావేశాలకు రాజకీయ పార్టీలు సువిధ యాప్ ద్వారా దరఖాస్తు చేసుకుంటే 24 నుంచి 48 గంటల్లో అనుమతులు ఇస్తారు. సువిధ యాప్‌ను గూగుల్ ప్లే స్టోర్ నుంచి డౌన్‌లోడ్ చేసుకోవచ్చు.

**సుగం యాప్...**

ప్రచార వాహనాల నియంత్రణకు సుగం యాప్ ఉపయోగపడుతుంది. అలాగే వాహనాలు నిబంధనలకు లోబడి ఉన్నాయా లేదా అని యాప్ ద్వారా ఎప్పటికప్పుడు పరిశీలిస్తారు.

**అనుమతి లేకుండా అడ్వర్టైజ్‌మెంట్ ఇస్తే అంతే!**

ఎలక్ట్రానిక్, సోషల్ మీడియాల్లో అనుమతి లేకుండా అడ్వర్టైజ్‌మెంట్, స్క్రోలింగ్, బల్క్ ఎస్‌ఎంఎస్, ఇతర రూపాల్లో ప్రచారం చేసుకుంటే అంతే సంగతులు. వాటి విలువను లెక్కించి సంబంధిత అభ్యర్థుల ఖర్చుల ఖాతాల్లో రాసేస్తారు. ఒక విధంగా చెప్పాలంటే పెయిడ్ న్యూస్ కింద పరిగణిస్తారు. ఎన్నికల్లో ఎమ్మెల్యే అభ్యర్థి రూ.40 లక్షలు, ఎంపీ అభ్యర్థి రూ.95 లక్షల వరకు ఖర్చు చేయవచ్చు. అంతకంటే ఎక్కువ ఖర్చుచేసి గెలిచినా వారి సభ్యత్వాలను రద్దు చేసే అవకాశం కేంద్ర ఎన్నికల సంఘానికి ఉంటుంది.





### పెద్దాసుపత్రికి ప్రత్యేక వెబ్‌సైట్


మాట్లాడుతున్న డాక్టర్ వి.వెంకటరంగారెడ్డి

**కర్నూలు(హాస్పిటల్):** కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలకు కొత్త వెబ్‌సైట్ రూపొందించనున్నట్లు ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ వి.వెంకటరంగారెడ్డి తెలిపారు. మంగళవారం ఆసుపత్రిలోని ధన్వంతరి హాలులో ఆరోగ్యశ్రీ, ఈ-హాస్పిటల్‌పై అన్ని విభాగాల హెచ్‌వోడీలు, ప్రొఫెసర్లుతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆసుపత్రిలోని అన్ని విభాగాలకు సంబంధించిన సమాచారాన్ని వెబ్‌సైట్‌లో పొందుపరచాలని, డిజైన్ విషయంలో ఆయా విభాగాల అధిపతుల సలహాలు, సూచనలు తెలియజేయాలన్నారు. ఆసుపత్రిలోని జనరల్ మెడిసిన్, ప్లాస్టిక్ సర్జరీ, న్యూరాలజీ విభాగాలకు సంబంధించి ఈ-హాస్పిటల్ అమలు మరింత మెరుగుపడాలని సూచించారు. అన్ని విభాగాలలో యూనిట్ వారీగా అటెండెన్స్ రిజిస్టర్‌లను సక్రమంగా నిర్వహించాలన్నారు. ఏఎంసీ, ఎస్‌ఐసీయు, ఓటీ విభాగాలలో కొత్త ఏసీలు అందుబాటులోకి రానున్నట్లు చెప్పారు. సమావేశంలో డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ సి. ప్రభాకర్‌రెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ హరిచరణ్, ఆసుపత్రి సీఎస్‌ఆర్‌ఎంవో డాక్టర్ బి.వెంకటేశ్వరరావు, ఆర్‌ఎంవో డాక్టర్ వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

# కామన్న వేడుకలు ప్రారంభం



కామన్న బొమ్మను ఏర్పాటు చేసి పందిరి వేసిన దృశ్యం, విచిత్ర వేషధారణలతో బలిదానాన్ని ప్రదర్శిస్తున్న యువకులు

**హొళగుంద:** హోలీ పున్నమి సందర్భంగా కామన్న వేడుకలు మంగళవారం మండల కేంద్రంలో ఘనంగా ప్రారంభమయ్యాయి. స్థానిక విరక్త మఠం పరిసర యువకులు మొదటి రోజు మంగళవారం మేటి కుంభోత్సవంలో మహిళల వేషధారణలతో అలరించారు. మరో తొమ్మిది రోజుల పాటు జరగనున్న వేడుకల్లో విరక్త మఠం పరిసర ప్రాంత యువకులు హాస్య సన్నివేశాలు ప్రదర్శించనున్నారు. కుట్టిదరే కుట్టమ్మ, ఇల్లిబా సంగయ్య, కూతురి కాన్పు కష్టాలు, సన్యాసులు, వరుడి అన్వేషణ, కామన్న భార్యల కష్టాలు, కామన్న దహనం తదితర హాస్య సన్నివేశాలను ప్రదర్శించనున్నారు. ముగింపు రోజున కామన్న దహనంలో భాగంగా మజ్జిగ బండ్లు, ఏనుగు, ఒంటెల ఊరేగింపు, పెళ్లి, అంత్యక్రియలకు తీసుకెళ్తున్న భర్త(కామన్న) శవం ముందు విధవలైన భార్యల రోదనల ఊరేగింపు తదితర కార్యక్రమాలతో ముగించి చివరి రోజు హోలీ పండుగను ఘనంగా జరుపుకుంటామని యువకులు తెలిపారు.

### గోడను ఢీకొన్న ట్రావెల్స్ బస్సు


గోడను ఢీకొన్న బస్సు

**మహానంది:** నల్లమలలోని నంద్యాల-గిద్దలూరు ఘాట్‌రోడ్డులో ఓ ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు ప్రమాదానికి గురైంది. శ్రీ తులసీ ట్రావెల్స్‌కు చెందిన బస్సు ద్రాక్షారామం నుంచి గంగావతి వెళ్తుండగా ఘాట్‌రోడ్డులోని పాత బొగద దిమ్మెను మంగళవారం ఢీకొంది. ఈ ఘటనలో క్లీనర్ నారపరెడ్డికి గాయాలైనట్లు స్థానికులు తెలిపారు. అదృష్టవశాత్తు ఎవరికి ఎలాంటి ముప్పు లేకపోవడంతో ప్రయాణికులు ఊపిరిపీల్చుకున్నారు. ప్రమాదం విషయం తెలుసుకున్న రోడ్‌సేఫ్టీ పోలీసులు ప్రసాద్, రసూల్, నూర్‌బాషలు సంఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని సమీక్షించారు. రోడ్డుకు అడ్డుగా ఉన్న బస్సును స్థానికుల సాయంతో పక్కకు తీయడంతో వాహనాల రాకపోకలు యథావిధిగా కొనసాగాయి.